వేసవిలో క్రీడా వీచిక

- స్టీల్‌ప్లాంట్‌లో మొదలైన సమ్మర్ క్యాంప్
- పాల్గొంటున్న 900 మంది బాలబాలికలు



బాక్సింగ్ నేర్చుకుంటున్న బాలబాలికలు



వ్యాయామం చేస్తున్న బాలబాలికలు

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ స్పోర్ట్స్ విభాగం ఆధ్వర్యంలో వేసవి శిబిరం ఉత్సాహంగా సాగుతోంది. స్టీల్‌ప్లాంట్ యాజమాన్యం బాలబాలికల కోసం ప్రత్యేకంగా వేసవిలో నిర్వహిస్తున్న క్రీడా శిబిరాల్లో భాగంగా ఈ ఏడాది కూడా శిక్షణ శిబిరం ఏర్పాటు చేసింది. ఈ నెల 3న ప్రారంభమైన క్యాంప్ ఈ నెల 15వ తేదీ వరకు కొనసాగనుంది. 8 నుంచి 20 ఏళ్ల మధ్య వయసు గల సుమారు 900 మంది బాలబాలికలు శిబిరంలో పాల్గొంటున్నారు. వీరికి ఉదయం, సాయంత్రం రెండు పూటలా శిక్షణ ఇస్తున్నారు. స్టీల్‌ప్లాంట్ స్పోర్ట్స్ విభాగం సీజీఎం డాక్టర్ కె.హెచ్. ప్రకాశ్ నేతృత్వంలో విభాగాధిపతి అమిత్ ఘుడాయ్ పర్యవేక్షణలో శిబిరం కొనసాగుతుంది.

వేదిక	క్రీడలు
ఉక్కు స్టేడియం:	అథ్లెటిక్స్, బాస్కెట్‌బాల్, బాక్సింగ్, చెస్, క్రికెట్, లాన్ టెన్నిస్, వాలీబాల్, యోగా
ఇండోర్ స్టేడియం :	షటిల్ బ్యాడ్మింటన్
సెక్టర్-1 హాకీ ఫీల్డ్:	హాకీ
త్రిష్ణా మైదానం:	కబడ్డీ
ఇందిరా పార్క్ స్కేటింగ్ రింక్ :	స్కేటింగ్

కోచ్‌లు

క్రీడా విభాగం ఉద్యోగులు ఎం.వి. మురళీమోహన్, జార్జ్, శ్రీధర్, రామస్వామి, కె. శ్రీనివాసరావు తదితరులతో పాటు ఆయా క్రీడల్లో ప్రతిభ కలిగిన ఉక్కు ఉద్యోగులు కోచ్‌లుగా వ్యవహరిస్తున్నారు.



యోగాభ్యాసాలు చేస్తూ..



చిన్నారుల జంపింగ్ ప్రాక్టీస్

సీఎం జగన్ పాలనలో అగ్రగామిగా ఏపీ



మహిళకు సంక్షేమ పథకాల బ్రోచర్‌ను అందజేస్తున్న ఎమ్మెల్యే నాగిరెడ్డి

అక్కిరెడ్డిపాలెం: సంక్షేమం, అభివృద్ధి రెండు కళ్లుగా సీఎం జగన్ మోహన్‌రెడ్డి పరిపాలన సాగిస్తున్నారని ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి అన్నారు. ఆంధ్రప్రదేశ్‌ను దేశంలోనే అగ్రగామిగా నిలబెట్టే సత్తా ఉన్న నాయకుడు జగన్ ఒక్కడే అన్నారు. 69వ వార్డు రెడ్డితుంగ్లాంలో గురువారం సాయంత్రం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రతీ ఇంటికి వెళ్లి జగన్‌మోహన్ రెడ్డి అందజేస్తున్న సంక్షేమ పథకాలను మహిళలకు వివరించారు. సంక్షేమ పథకాల బ్రోచర్‌ను అందజేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ సంక్షేమ పాలన అందిస్తున్న జగన్‌పై చంద్రబాబు బ్యాచ్ విషం చిమ్ముతూ రాష్ట్ర అభివృద్ధిని అడ్డుకుంటున్నారన్నారు. విద్యా, వైద్యంతో పాటు మహిళా సాధికారత దిశగా అడుగులు వేస్తున్న జగన్ మోహన్ రెడ్డికి యావత్ రాష్ట్ర ప్రజల ఆశీర్వాదం ఉందన్నారు. సంక్షేమ పథకాలు పొందుతున్న వారిలో టీడీపీ, జనసేన నాయకులు, కార్యకర్తలే ఎక్కువగా ఉన్నారని తెలిపారు. వైఎస్సార్ సీపీ వార్డు అధ్యక్షుడు బోగాది సన్యాసిరావు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి తిప్పల దేవన్ రెడ్డి, , కాకి అప్పల రెడ్డి, విరోతి రాము, సాలాపు వెంకటరావు, వాకాడ దుర్గారెడ్డి, మద్ది గోవింద్‌రెడ్డి, అంగ బాబూరావు, గిడుతురి పోలిరాజు తదితరులు పాల్గొన్నారు.

కార్మికుల సంక్షేమాన్ని ఆలోచించాలి



దీక్షలో పాల్గొన్న పోరాట కమిటీ నాయకులు

కూర్మన్నపాలెం: కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలు కార్మిక సంక్షేమానికి తీవ్ర నష్టాన్ని కలిగిస్తున్నాయని ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ నాయకులు ఆందోళన వ్యక్తం చేశారు. కార్మిక సంక్షేమంపై కేంద్రప్రభుత్వం పునరాలోచించాలని కోరారు. ఉక్కు కర్మాగారం ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెం కూడలిలోని స్టీల్‌ప్లాంట్ ఆర్చి వద్ద నిర్వహిస్తున్న రిలే నిరాహార దీక్షలు గురువారానికి 812వ రోజుకు చేరుకున్నాయి. దీక్షలో సంస్థకు చెందిన టీపీపీ, ఆర్ఈడీ, పీఈఎం స్టోర్స్, ఎస్ఎండీ విభాగ కార్మికులు పాల్గొన్నారు. నాయకులు మాట్లాడుతూ దేశ సంపదను కార్పొరేట్ కంపెనీలకు కట్టబెడితే, దాని ఫలితంగా మౌలిక సదుపాయాల కల్పనలన్నీ ఆ కంపెనీల చేతుల్లోకి వెళ్లిపోతాయన్నారు. దీంతో ప్రజలపై భారాలు మరింత పెరుగుతాయన్నారు. ప్రజల సొమ్ముతో ప్రభుత్వరంగ సంస్థలను అభివృద్ధి చేసి, వాటిని ప్రైవేట్ వ్యక్తులకు అప్పగిస్తే వారు లాభాలను దండుకుని ప్రజలను అణచివేస్తారని విమర్శించారు. అందుకే విశాఖ ఉక్కుతో సహా అన్ని ప్రభుత్వరంగ సంస్థల ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తున్నామన్నారు. కేంద్రప్రభుత్వం ప్రభుత్వరంగ సంస్థల ప్రైవేటీకరణ నిర్ణయాన్ని విరమించుకోవాలని, లేనిపక్షంలో తమ ఆందోళనలను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో పోరాట కమిటీ నాయకులు, ఇతర కార్మికులు పాల్గొన్నారు.

ఇంటి వద్దకే ఆరోగ్య సేవలు



మంచానికే పరిమితమైన రోగిని పరీక్షిస్తున్న డాక్టర్ పద్మ

అక్కిరెడ్డిపాలెం: రాష్ట్రప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం దిగ్విజయంగా కొనసాగుతోంది. అందులో భాగంగా గురువారం గాజువాక ఆరోగ్య కేంద్రం పరిధిలోని రెడ్డితుంగ్లాంలో రోగులకు డాక్టర్ పి.పద్మ వైద్యసేవలు అందించారు. ముందుగా రెడ్డితుంగ్లాం పీహెచ్‌సీలో 80 మంది దీర్ఘకాలిక రోగులకు ఉచిత రక్తపరీక్షలు, ఆరోగ్య పరీక్షలు చేసి, నెలకు సరిపడా మందులను అందజేశారు. అనంతరం గ్రామంలోని అంగన్‌వాడీ సెంటర్‌లో చిన్నారుల ఆరోగ్య పరిస్థితి, వారికి అందిస్తున్న ఆహారం తదితర వివరాలను సంబంధిత అంగన్‌వాడీ కార్యకర్త ద్వారా అడిగి తెలుసుకున్నారు. రెడ్డితుంగ్లాంలో మంచానికే పరిమితమైన నీలాపు శ్రీనివాసరెడ్డి ఇంటికి వెళ్లి, ఆయనకు వైద్య పరీక్షలు చేసి, నెలకు సరిపడా మందులను అందజేశారు. కార్యక్రమంలో ఆరోగ్య విస్తరణాధికారి ఎస్.ఎస్.వి.ఎన్.రాజు, ఆరోగ్య పర్యవేక్షకుడు కె.కిషోర్‌కుమార్, సచివాలయ హెల్త్ కార్యదర్శి పద్మావతి, ఆశ కార్యకర్త వరలక్ష్మి, సిబ్బంది అశోక్ తదితరులు పాల్గొన్నారు.

దోమల మందు పిచికారీ



దోమల నివారణ మందు పిచికారీ చేయిస్తున్న డీఎంవో సత్యనారాయణ

అక్కిరెడ్డిపాలెం: ఇళ్లలోని ఫ్రిజ్‌లు, టైర్లు, పరిసరాల్లోని కొబ్బరిబొండాల్లో దోమల లార్వా వృద్ధి చెందే అవకాశం ఉన్నందున ఎప్పటికప్పుడు నీటి నిల్వలను తొలగించాలని డీఎంవో సీహెచ్.సత్యనారాయణ సూచించారు. 69వ వార్డు అక్కిరెడ్డిపాలెంలో గురువారం యాంటి మలేరియా ఆపరేషన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రామంలోని కాలువల్లో మలేరియా సిబ్బంది దోమల నివారణ మందులను పిచికారీ చేశారు. పరిసరాల్లో ఉన్న టైర్లు, కొబ్బరి బొండాలను గుర్తించి, తొలగించారు. ఫ్రిజ్‌ల వెనుక ఉన్న ట్రేలలో దోమల లార్వాను గుర్తించి, మందులను వేశారు. కార్యక్రమంలో ఎంపీహెచ్‌వో మేడిద మురళీ కృష్ణ, ఎల్ఎంలు అప్పలనాయుడు, రామయోగి, వై.అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

దువ్వాడ స్టేషన్‌లో మూతపడిన క్యాంటీన్



దువ్వాడ రైల్వేస్టేషన్ ఒకటో నంబర్ ప్లాట్‌ఫాంపై మూతపడిన క్యాంటీన్

అగనంపూడి: దువ్వాడ రైల్వేస్టేషన్ ఒకటో నంబర్ ప్లాట్‌ఫాంపై క్యాంటీన్ నాలుగు మాసాల నుంచి మూతపడింది. గతంలో ఐఆర్‌సీటీసీ ఆధ్వర్యంలో క్యాంటీన్ సర్వీస్ అందుబాటులో ఉండేది. అయితే, అప్పట్లో టిఫిన్, టీ, కాఫీల నాణ్యత లేదని ప్రయాణికులు ఫిర్యాదు చేయడం, కాంట్రాక్టర్ గడువు ముగిసిన తరువాత సదరు కాంట్రాక్టర్‌ను కొనసాగించకపోడంతో నాలుగు మాసాల నుంచి క్యాంటీన్ మూత పడింది. దీంతో ప్రయాణికులు ఇబ్బంది పడుతున్నారు. ఉదయం జన్మభూమి, సింహాద్రి ఎక్స్‌ప్రెస్‌లకు వెళ్లే వారు టిఫిన్ల కోసం దూరం వెళ్లాల్సి వస్తోంది, సమయం లేకుంటే అలానే ఉండిపోవాల్సిన పరిస్థితి. ఇక్కడి సిబ్బంది కూడా రెండు కిలోమీటర్ల దూరంలోని రాజీవ్‌నగర్ జంక్షన్ నుంచి టీ, టిఫిన్లు రప్పించుకుంటున్నారు. రైల్వే ఉన్నతాధికారులు స్పందించి క్యాంటీన్ ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని ప్రయాణికులు కోరుతున్నారు.

స్టీరింగ్ ఊడిపోయిన ట్యాంకర్

- రోడ్డుపై అడ్డదిడ్డంగా పరుగులు
- డ్రైవర్ అప్రమత్తతతో తప్పిన ప్రమాదం



వడ్లపూడి జంక్షన్ వద్ద పక్కకు ఆపిన ట్యాంకర్

కూర్మన్నపాలెం: అగనంపూడి నుంచి వడ్లపూడి మీదుగా ఆటోనగర్ వైపు వెళ్తున్న ట్యాంకర్ వడ్లపూడి జంక్షన్ వద్ద స్టీరింగ్ ఊడిపోవడంతో రోడ్డుపై అడ్డదిడ్డంగా పరుగులు పెట్టింది. డ్రైవర్ అప్రమత్తంగా వ్యవహరించి, ట్యాంకర్ లారీని అదుపు చేయడంతో పెను ప్రమాదం తప్పింది.

వివరాల్లోకి వెళ్తే.. గురువారం ఉదయం అగనంపూడి జాతీయ రహదారి నుంచి సల్ఫ్యూరిక్ యాసిడ్ లోడుతో ఆటోనగర్ వెళ్తున్న ట్యాంకర్ వడ్లపూడి కూడలి వద్దకు వచ్చేసరికి అకస్మాత్తుగా లారీ స్టీరింగ్ ఊడిపోయింది. దీంతో ట్యాంకర్ రోడ్డుపై అడ్డదిడ్డంగా పరుగులు తీస్తుండడంతో ఆ మార్గంలో ప్రయాణించిన వారు తీవ్ర భయాందోళనకు గురయ్యారు. డ్రైవర్ చాకచక్యంగా వ్యవహరించి, లారీని పక్కకు నిలపడంతో పెను ప్రమాదం తప్పింది. అయితే ప్రధాన కూడలి కావడంతో వడ్లపూడి జంక్షన్ వద్ద కొంత సమయం ట్రాఫిక్ స్తంభించింది. విషయం తెలుసుకున్న ట్రాఫిక్ పోలీసులు అక్కడికి చేరుకుని ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు. ఎవరికీ ఎటువంటి ప్రమాదం జరగకపోవడంతో ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు.

యువతి అదృశ్యం

పెదగంట్యాడ: జీవీఎంసీ 76వ వార్డు పరిధిలోని హౌసింగ్ బోర్డు కాలనీకి చెందిన ఓ యువతి అదృశ్యమైన ఘటనపై న్యూపోర్టు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు అందింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. హౌసింగ్ బోర్డు కాలనీలో కుటుంబంతో నివాసం ఉంటున్న వారణాశి కృష్ణమూర్తి కుమార్తె తులసీ కల్యాణి (24) ఈ నెల 3న ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. స్నేహితులు, బంధువుల ఇళ్లలో వెతికినా ప్రయోజనం లేకపోవడంతో, కల్యాణి తల్లి వెంకటరమణమ్మ న్యూపోర్టు పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ప్రజల్లోకి విస్తృతంగా కేంద్ర పథకాలు

గాజువాక : కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలపై బీజేపీ నాయకులు, కార్యకర్తలు ప్రజల్లో విస్తృత ప్రచారం నిర్వహించాలని ఆ పార్టీ గాజువాక కన్వీనర్ కరణంరెడ్డి నర్సింగరావు కోరారు. 67వ వార్డులో గురువారం నిర్వహించిన బూత్ స్వశక్తికరణ్ అభియాన్ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ప్రధానమంత్రి మోదీ ఆధ్వర్యంలో అనేక సంక్షేమ కార్యక్రమాలు అమలవుతున్నాయని, వాటికి ప్రజలకు తెలియజేయాలని సూచించారు. కార్యక్రమంలో నాయకులు గూటూరు శంకరరావు, విశ్వనాథం, గరికిన పైడిరాజు, రామస్వామి, రాహుల్, పేర్ల అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ స్థలంలో ఆక్రమణల తొలగింపు



రెవెన్యూ అధికారులు తొలగించిన అక్రమ నిర్మాణాలు

పెదగంట్యాడ: ప్రభుత్వ భూములు, కొండపోరంబోకు స్థలాలు, చెరువులు, గెడ్డలను ఆక్రమిస్తే చర్యలు తీసుకుంటామని ఆర్డీవో హుస్సేన్ సాహెబ్ హెచ్చరించారు. జీవీఎంసీ 65వ వార్డు పరిధి వాంబే కాలనీలో సర్వే నెంబర్ 274లో కొండపోరంబోకు స్థలాన్ని ఆక్రమించి, చేపట్టిన అక్రమ నిర్మాణాలను బుధవారం అర్ధరాత్రి ఒంటి గంట నుంచి గురువారం వేకువజాము 3 గంటల సమయంలో రెవెన్యూ అధికారులు తొలగించారు. ఈ సందర్భంగా ఆయన గురువారం ఉదయం మండల రెవెన్యూ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. దేవుని ఆలయం పేరుతో కొంతమంది కొండ పోరంబోకు స్థలాన్ని ఆక్రమించి, అక్రమంగా నిర్మాణాలు చేపట్టారని తమకు ఫిర్యాదులు అందాయని తెలిపారు. ఫిర్యాదులు పరిశీలించిన మేరకు ఆ స్థలంలో నిర్మాణాలను తొలగించామన్నారు. భవిష్యత్తులో ఎవరైనా మళ్లీ అక్కడ నిర్మాణాలు చేపడితే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. తహసీల్దార్ రమాదేవి మాట్లాడుతూ భూ ఆక్రమణలకు పాల్పడిన వ్యక్తులపై న్యూపోర్టు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశామని తెలిపారు.

ఘనంగా రామాలయ ధ్వజస్తంభం ఊరేగింపు



ధ్వజ స్తంభానికి పూజలు చేస్తున్న అర్చకులు

పెదగంట్యాడ: జీవీఎంసీ 75వ వార్డు నెల్లిముక్కులోని రామాలయంలో ప్రతిష్ఠించనున్న ధ్వజస్తంభానికి గురువారం ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం పెదగంట్యాడ జంక్షన్ నుంచి నెల్లిముక్కు రామాలయం వరకు ఊరేగించారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో రూ.10లక్షలతో ఏర్పాటు చేయనున్న ధ్వజ స్తంభానికి వేదమంత్రాలతో పూజలు చేశారు. కోలాటాలు, భజనలు, సాము గరిడీలు, డప్పు వాయిద్యాలతో ఊరేగింపు ఘనంగా జరిగింది. మూడు రోజుల పాటు ప్రత్యేక పూజల అనంతరం స్తంభాన్ని ప్రతిష్ఠించనున్నారు. పెద్ద సంఖ్యలో భక్తులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

హైమాస్ట్ లైట్లు ప్రారంభం



హైమాస్ట్ లైట్లను స్విచ్ ఆన్ చేసి ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే నాగిరెడ్డి

కూర్మన్నపాలెం: కూర్మన్నపాలెం జంక్షన్‌లోని అంబేడ్కర్, జ్యోతిరావుపూలే, గౌతమ్‌బుద్ధుని విగ్రహాల వద్ద జీవీఎంసీ నిధులతో ఏర్పాటు చేసిన హైమాస్ట్ లైట్లను ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి గురువారం సాయంత్రం ప్రారంభించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ తాగునీటి సరఫరా, వీధి దీపాల నిర్వహణ కోసం నిధులను వెచ్చిస్తున్నామన్నారు. జీవీఎంసీకి భారంగా మారిన కరెంటు బిల్లులను తగ్గించేందుకు ప్రయత్నాలు చేస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో 86వ వార్డు కార్పొరేటర్ లేళ్ల కోటేశ్వరరావు, 87వ వార్డు వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు ప్రగడ వేణుబాబు, బొడ్డ గోవింద్, దుగ్గపు దానప్పలు ఇతర నాయకులు పాల్గొన్నారు.

సమయపాలన తప్పనిసరి

- యూపీహెచ్‌సీ వైద్య సిబ్బందితో డీఎంహెచ్‌వో



శివనగర్ ఆరోగ్య కేంద్రంలో రికార్డులు పరిశీలిస్తున్న డీఎంహెచ్‌వో జగదీశ్వరరావు

మహారాణిపేట: డాక్టర్ వైఎస్సార్ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్య సిబ్బంది అందరూ సమయపాలన తప్పనిసరిగా పాటించాలని జిల్లా వైద్య, ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ పి.జగదీశ్వరరావు ఆదేశించారు. మర్రిపాలెం శివనగర్ ఆరోగ్య కేంద్రంలో గురువారం ఆయన ఆకస్మిక తనిఖీలు చేశారు. రికార్డులు, మందుల నిల్వలను పరిశీలించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సమీక్షలో డీఎంహెచ్‌వో జగదీశ్వరరావు మాట్లాడుతూ అన్ని అర్బన్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో వైద్యులు, సిబ్బంది తమ విధులను సక్రమంగా నిర్వహించాలని సూచించారు. బర్త్ ప్లానింగ్ గురించి, హై రిస్క్ గర్భిణులను గుర్తించి డాక్టర్ల సలహా నిమిత్తం ఐరన్ ఫోలిక్ మాత్రలు, పోషకాహారం తీసుకునేటట్లు ప్రోత్సహించాలన్నారు. సాధారణ ప్రసవాలు అయ్యేలా ప్రోత్సహించాలని, శస్త్రచికిత్స ప్రసవాలను తగ్గించాలని ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. వైద్యాధికారులు, ఆరోగ్య సిబ్బంది అందరూ డ్రెస్ కోడ్ పాటించాలని పలు సూచనలిచ్చారు. యూపీహెచ్‌సీ వైద్యులు, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

బుద్ధ జయంతి నేడు



ప్రత్యేక అలంకరణలో బుద్ధుడు

కంచరపాలెం: ఆంధ్ర బౌద్ధ కేంద్ర సమాజం ఆధ్వర్యంలో శుక్రవారం వైశాఖ పౌర్ణమి బుద్ధ జయంతి వేడుకలు నిర్వహించనున్నారు. ఈ మేరకు కంచరపాలెం అశోక్‌నగర్‌లోని బౌద్ధాలయంలో ఏర్పాట్లు పూర్తి చేసినట్లు యూత్ సెంటర్ గౌరవ అధ్యక్షుడు, సమాజం కార్యదర్శి కె.రాజు గణేష్ తెలిపారు. ఈ సందర్భంగా బౌద్ధ భిక్షువులచే బౌద్ధ సూక్తులతో పూజలు, ప్రసాద వితరణ, అనంతరం వృద్ధులకు చీరల పంపిణీ, పేదలకు అన్నదానం, చలివేంద్రాలు ఏర్పాటు చేయనున్నట్లు చెప్పారు. బౌద్ధాలయం, బుద్ధుడి విగ్రహానికి రంగులు వేసి సుందరంగా అలంకరించామన్నారు.

కాంట్రాక్టు పనుల ప్రారంభానికి వినతి



సీజీఎం మొహంతికి సమస్య వివరిస్తున్న పైడిరాజు

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ నిర్వాసిత కాంట్రాక్టు కార్మికులకు చెందిన నూతన కాంట్రాక్టు పనులను సత్వరం ప్రారంభించాలని ఉక్కు శ్రామిక సంఘం ప్రధాన కార్యదర్శి బొడ్డు పైడిరాజు కోరారు. స్టీల్‌ప్లాంట్ చీఫ్ జనరల్ మేనేజర్ (వర్క్స్) బి.కె. మొహంతిని గురువారం ఆయన కలిసి ఈ మేరకు విజ్ఞప్తి చేశారు. 142 మంది కాంట్రాక్టు కార్మికులు నెల రోజులుగా పనులు లేక పస్తులు ఉంటున్నారన్నారు. యాజమాన్యం చొరవ తీసుకుని తాత్కాలికంగా 30 రోజులకు కొత్త కాంట్రాక్టర్‌కు పనులు అప్పగించడం అభినందనీయమన్నారు. దానికి సంబంధించిన సేఫ్టీ ట్రైనింగ్ కూడా పూర్తయిందన్నారు. పనులను వెంటనే ప్రారంభించేలా కాంట్రాక్టర్‌ను ఆదేశించాలని కోరారు.

స్వచ్ఛ సర్వేక్షణ్‌కు సహకరించండి



కార్యక్రమంలో మాట్లాడుతున్న జెడ్సీ సింహాచలం

పెదగంట్యాడ: స్వచ్ఛ సర్వేక్షణ్‌లో విశాఖను నంబర్ వన్‌గా నిలిపేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని జోనల్ కమిషనర్ పొందూరు సింహాచలం కోరారు. 77వ వార్డు పరిధిలోని నమ్మిదొడ్డి జంక్షన్‌లో స్వచ్ఛ సర్వేక్షణ్‌పై గురువారం నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. ప్రతి ఒక్కరూ శుభ్రత పాటిస్తే ఆరోగ్యవంతమైన సమాజాన్ని నిర్మించవచ్చన్నారు. ఇళ్లలోని చెత్తను రోడ్లు, కాలువల్లో వేయవద్దని, ప్రతి రోజూ ఇంటి వద్దకు వచ్చే పారిశుధ్య సిబ్బందికి అందజేయాలని సూచించారు. కార్యక్రమంలో కార్పొరేటర్ బట్టు సూర్యకుమారి, ఏఎంవోహెచ్ డాక్టర్ కిరణ్‌కుమార్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ అప్పలరాజు తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

నాడు-నేడు పనుల పరిశీలన



సిబ్బందితో మాట్లాడుతున్న ఏఈ శేషారత్నం

అగనంపూడి: అగనంపూడి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నిర్వహిస్తున్న నాడు నేడు పనులను గాజువాక ఏఈ ఇ.శేషారత్నం గురువారం పరిశీలించారు. ఆమె మాట్లాడుతూ రూ.61 లక్షలతో నీటి శుద్ధి ప్లాంట్, మరుగుదొడ్లు, ప్రహరీ నిర్మాణాలతో పాటు గోడలపై రకరకాల బొమ్మల చిత్రీకరణ చేయడం జరుగుతుందన్నారు. ఈ పనులు త్వరితగతిన పూర్తయ్యేలా కమిటీ చొరవ తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ బి.సుశీల్‌కుమార్, కమిటీ ప్రతినిధులు పాల్గొన్నారు

గుర్తు తెలియని వ్యక్తి మృతి



మృతుడు

అక్కిరెడ్డిపాలెం: గాజువాక పోలీస్ స్టేషన్ పరిధిలో వంటిల్లు జంక్షన్ వద్ద ఓ వృద్ధుడి మృతదేహాన్ని పోలీసులు గురువారం గుర్తించారు. స్థానికుల సమాచారం మేరకు ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని కేజీహెచ్‌కు తరలించారు. మృతుని వయసు 60 సంవత్సరాలు ఉంటుందని గాజువాక ఎస్ఐ కొల్లి సతీష్ తెలిపారు. ఆచూకీ తెలిసిన వారు గాజువాక పోలీస్ స్టేషన్‌లో సంప్రదించాలని తెలియజేశారు.

'శ్మశాన వాటికలో సౌకర్యాలు కల్పించండి'



ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

పెదగంట్యాడ: జీవీఎంసీ 75వ వార్డు పెదగంట్యాడలోని శ్మశాన వాటికలో సౌకర్యాలు కల్పించాలని వైఎస్సార్‌సీపీ నాయకులు ఎమ్మెల్యే నాగిరెడ్డిని కోరారు. గురువారం వారు ఎమ్మెల్యేను కలిసి వినతిపత్రం అందించారు. వారు మాట్లాడుతూ శ్మశానవాటికలో పిచ్చి మొక్కలు ఏపుగా పెరిగిపోయాయని, చెత్త పేరుకుపోయిందని తెలిపారు. వెంటనే దానిని తొలగించి, శుభ్రం చేయించాలని, సౌకర్యాలు కల్పించాలని విన్నవించారు. ఎమ్మెల్యేని కలిసిన వారిలో మార్టుపూడి పరదేశి, గొందేశి శ్రీనివాస్ రెడ్డి, గొందేశి వెంకటరమణారెడ్డి, పిట్టా రెడ్డి, సంపంగి ఈశ్వరరావు, వెంకటేష్ ఉన్నారు.

పారిశుధ్య కార్మికులకు హెల్త్ కిట్ల పంపిణీ



కిట్లు అందుకున్న పారిశుధ్య కార్మికులతో కార్పొరేటర్ నర్సింహపాత్రుడు

పెదగంట్యాడ: పారిశుధ్య కార్మికులు ఆరోగ్యం విషయంలో జాగ్రత్తలు వహించాలని 65వ వార్డు కార్పొరేటర్ బొడ్డు నర్సింహపాత్రుడు సూచించారు. రాజీవ్ ఇండోర్ స్టేడియం ఆవరణలో బాపూజీ కాలనీ సచివాలయం వద్ద పారిశుధ్య కార్మికులకు గురువారం ఆయన హెల్త్ కిట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వార్డు నాయకులు సూర్యప్రకాష్, అప్పలరాజు, శానిటరీ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

అప్పన్నకు ఆర్జిత సేవలు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి గురువారం ఆర్జిత సేవలు విశేషంగా జరిగాయి. ఉదయం 7 నుంచి 8 గంటల వరకు స్వర్ణపుష్పార్చన సేవ నిర్వహించారు. స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజ స్వామి, శ్రీదేవి, భూదేవిలను అలంకరించి కల్యాణ మండపంలోని వేదికపై అధిష్టంపజేశారు. 108 స్వర్ణ సంపెంగ పుష్పాలతో స్వామికి అష్టోత్తర శతనామావళి పూజ చేసి విశేషంగా హారతులు అందజేశారు. అర్చకుడు చిన్నా తదితరులు ఈపూజను నిర్వహించారు.